యువతకు నిరాశే

- వరుసగా మూడు రోజులు సెలవులు
- రేపటితో రాజీవ్ యువవికాసానికి దరఖాస్తుల గడువు ముగింపు
- దరఖాస్తులకు.. సర్వర్ అడ్డు
- అందని ధ్రువీకరణ పత్రాలు



మీ సేవ కార్యాలయం

హసన్‌పర్తి: రాజీవ్ యువ వికాసం పథకం ఆశావహుల్లో ఆందోళన కనిపిస్తోంది. అర్హత కలిగిన కుల, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు అందకపోవడంతో దరఖాస్తుదారులు నిరాశకు గురవుతున్నారు. ఈ పథకానికి ఏప్రిల్ 14 చివరి తేదీ., వరుసగా 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు ప్రభుత్వ సెలవులు ఉండడంతో కార్యాలయాలు బంద్ ఉన్నందున సంబంధిత పత్రాలు అందకపోవడంతో దరఖాస్తుదారులు, అప్లికేషన్ సమర్పించుకోలేకపోతున్నారు. వారం రోజులుగా ఇటూ మండల రెవెన్యూ కార్యాలయం, అటూ మీ-సేవల్లో సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. స ర్వర్ పని చేయకపోవడంతో ఇటు సర్టిఫికెట్లు జారీ చేయలేక..అటు సర్టిఫికెట్లు కోసం దరఖాస్తులు స్వీకరించుకోలేకపోయారు. దీంతో రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తులు చేసుకోలేని పరిస్థితి. వా రం రోజులుగా ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్లు పరిశీలించారు. దరఖాస్తులు కుప్పతెప్పలుగా పేరుకుపోయాయి. అయితే సర్టిఫికెట్ల కోసం దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. సర్వర్ అడ్డు రావడంతో నిరాశకు గురవుతున్నారు. సర్టిఫికెట్ల జారీ వేగవంతం చేయడానికి అర్ధరాత్రి వరకు కూడా కార్యాలయంలో ఉన్నప్పటికీ సర్వర్ డౌన్ కారణంగా ఏమీ చేయలేక పోతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. మండల వ్యాప్తంగా కుల, ఆదాయం, నివాసానికి సంబంధించిన సుమారు మూడు వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈనెల 14న దరఖాస్తుల గడువు ముగింపు. సెలవులోనే గడువు ముగియనుండడంతో యువత ఆందోళన చెందుతున్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేశ్


జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పలయ్య, రమేష్

హన్మకొండ చౌరస్తా : రాజ్యాంగాన్ని రక్షించుకుందాం అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ అన్నారు. సామాజిక న్యాయసాధన ప్రచారంలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం వేయి స్తంభాల గుడి నుంచి నక్కలగుట్ట లోని కాళోజీ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన రమేష్ మాట్లాడుతూ శ్రమ దోపిడీ, సామాజిక అణిచివేత వివక్షల అంతంకై ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. సాంకేతికంగా ఎంతో పురోగతి సాధించినప్పటికీ సాటి మనిషిని మనిషిగా చూడలేని దుర్మార్గపు స్థితి నేటికి కొనసాగుతుందన్నారు. కుల వివక్షత నశించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీఐ టీయూ జిల్లా అధ్యక్షుడు టి. ఉప్పల య్య, ఆఫీస్ బేరర్స్ బొట్ల చక్రపాణి, పెండ్యాల రవి, అశోక్, రజిత, యాసబాబు, మంద మల్లేషం, కారు ఉపేందర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మతం కంటే జీవన విధానం గొప్పది



హసన్‌పర్తి : మతం కంటే జీవన విధానం గొప్పదని ప్రముఖ న్యాయవాది సౌమిత్రి లక్ష్మణాచార్య అన్నారు. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కిట్స్ కళాశాల స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముగ్గురి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్రక్రమంలో యోగా గురువు సత్యం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ శ్రీలత, డాక్టర్ నరసింహారావు, గ్రేస్ శాంతి, ప్రభాకరాచారి పాల్గొన్నారు.

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలి


ఎంపీ కావ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ బాధ్యులు

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని శనివారం కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ హనుమకొండలో వరంగల్ ఎంపీ కడియం కావ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. వివిధ రాష్ట్రాల్లోని యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఏవిధంగా రెగ్యులరైజ్ చేశారో వాటికి సంబంధించిన వివరాలను కూడా ఎంపీకి వివరించారు. రెగ్యులరైజేషన్ ఆలస్యమైతే ఉద్యోగ భద్రతతో కూడిన యూజీసీ ఏడో వేతన సవరణ ప్రకారం బేసిక్ పే ప్లస్ డీఏ హెచ్ఆర్ఏ, మూడు శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. ఆ తర్వాతే నూతన నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ స్పందిస్తూ మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో కుటా అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, జేఏసీ నాయకులు రాజేష్, టి నాగయ్య, సంగీత్‌కుమార్, లక్ష్మారెడ్డి, ఎం.లింగయ్య,కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



వరంగల్ : కాశిబుగ్గలోని లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో శనివారం దాత, మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి, రాజ్యలక్ష్మి దంపతులు మజ్జిగ పంపిణీ చేశారు. సీతారామాంజనేయ దేవస్థానం అర్చకులు శ్రీకాంతాచారి, సంఘం అధ్యక్షుడు వి.రాంప్రసాద్, డి.కృష్ణ, వేముల నాగరాజు, డి.శివకృష్ణ, ఎం.చంద్రశేఖర్, వంగరి రవి, జగన్, శ్రీనివాస్, పవన్, రాజేష్, బి.రాజేశ్వరరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తిలక్‌నగర్‌లో సీపీఎం ఇంటింటి సర్వే


కాజీపేట : తిలక్‌నగర్ కాలనీలో సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

కాజీపేట : 63వ డివిజన్ తిలక్‌నగర్ కాలనీలో శనివారం సీపీఎం కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించారు. మండల పార్టీ కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి సమస్యలపై ఇంటింటికి వెళ్లి నిత్యం ఎదురవుతున్న ఇబ్బందులపై కాలనీవాసులతో చర్చించారు. ప్రధానంగా సైడ్ డ్రైనేజీ సమస్యను సర్వేలో గుర్తించారు. సర్వేలో మండల కమిటీ సభ్యులు మల్లేశం, రమేష్, కుమార్, ఎడ్ల మేరీల, అజయ్, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి : ప్రజాపాలనపై సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని సీతంపేట, నాగారం గ్రామాల్లో శనివారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీల్లోకి వెళ్లి సర్వే చేపట్టగా 200 యూనిట్ల విద్యుత్, గ్యాస్ సబ్సిడీ వర్తించడం లేదని స్థానికులు చెప్పారు. గ్రామాల్లో మురికి కాల్వలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, సీతంపేటలో వీధి దీపాలు వెలగడం లేదని ఆ గ్రామస్తులు చెప్పగా, నాగారంలో నిరంతరం వీధి లైట్లు వెలుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడి రాములు, నాయకులు సురేందర్, సుచేందర్, ఫుల్లా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశపరీక్ష లేకుండా నిబంధన అమలు చేయాలి

నయీంనగర్ : ఇంటర్ అయిపోయిన విద్యార్థులకు ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండానే డిగ్రీలో చేరే విధంగా యూజీసీ మార్గదర్శకాలను అమలు చేయాలని ఆల్ తెలంగాణ స్టూడెంట్స్ ఫోరం కోరింది. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో సాయికిరణ్, వికాస్, శ్రీకాంత్‌లు మాట్లాడుతూ యూజీ, పీజీ అడ్మిషన్‌లలో మాత్రమే యూజీసీ మార్గదర్శకాలను అమలు చేయాలని కోరారు. ప్రవేశ పరీక్ష గ్రామీణ ప్రాంత విద్యార్థులకు భారంగా మారుతుందని గ్రహించాలని కోరారు. కార్యక్రమంలో నవ్య, కృష్ణబాబు, ఆదిత్య, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

అల్లం పేస్ట్ తయారీ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- రూ.1,52,040 విలువైన అల్లం స్వాధీనం


అల్లం వెల్లుల్లి పేస్టును చూపుతున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

ఖిలా వరంగల్ : ఎలాంటి అనుమతులు, ట్రేడ్ లైసెన్స్ లేకుండా తయారు చేసి విక్రయిస్తున్న అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై శనివారం టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసి రూ.1,52,040 విలువైన అల్లం స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సార్ల రాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటలో గై సతీష్ ట్రేడ్ లైసెన్స్, ఎలాంటి అనుమతులు లేకుండా అల్లం వెల్లుల్లి పేస్ట్‌గా తయారు చేసి విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్‌కు పక్కా సమాచారం అందింది. ఏసీపీ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం ఎస్ఆర్ఆర్‌తోటలో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై ఆకస్మికంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి సతీష్‌పై కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం కేసును మున్సిపల్ అధికారులకు అప్పగించినట్లు సీఐ రాజు తెలిపారు. దాడుల్లో ఆర్ ఎస్సై భాను ప్రకాశ్, కానిస్టేబుళ్లు సురేష్, సురేందర్, సాంబరాజు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి స్ఫూర్తితో ఉద్యమిద్దాం




కేయూ క్యాంపస్ : జార్జిరెడ్డి స్ఫూర్తితో వివిధ సామాజిక, విద్యారంగ సమస్యలపై ఉద్యమిద్దామని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుర్గం సారయ్య పిలుపునిచ్చారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద జార్జిరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తూ జోహార్లు అంటూ నినదించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన వేణురాజ్, నగర అధ్యక్షుడు శివకుమార్, బాధ్యులు అనిల్, మధు, సంతోష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హిందీ హెచ్‌ఎం మృతి


విద్యారణ్యపురి : హనుమకొండ రాంనగర్ ప్రాంతానికి చెందిన ప్రముఖ హిందీ కవి, హిందీ రిటైర్డ్ హెచ్‌ఎం అన్వర్ (63) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అన్వర్ హిందీ భాషా బోధనా, సాహిత్యంలోనూ, వ్యాకరణంలో నిపుణుడు, ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషల్లో కూడా కవితలు, కథలు రాశారు.

ఉత్తమ ప్రెస్‌క్లబ్‌గా ఎంపిక


అవార్డు అందుకుంటున్న అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య

నయీంనగర్ : తెలంగాణ రాష్ట్రంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఉత్తమ ప్రెస్‌క్లబ్‌గా ఎంపికైంది. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ జర్నలిస్టులకు ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ చేతులమీదుగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ అవార్డు రావడం ప్రెస్‌క్లబ్ సభ్యులందరికీ దక్కిన గౌరవమన్నారు. అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందని, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, యూనియన్ నేతలు, సీనియర్ పాత్రికేయుల సూచనలతో ముందుకు వెళ్తామన్నారు. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

శిల్పం.. సుందరం



ఖిలావరంగల్ : ఖిలా వరంగల్ కోటను శనివారం యూరప్, స్వీడన్ దేశస్తులు సందర్శించారు. నల్లరాతిలో చెక్కిన శిల్ప కళా సంపదను ఆసక్తిగా తిలకించి ఎంతో సుందరంగా ఉన్నాయని కితాబిచ్చారు. ఖుష్‌మహల్‌ను చూసి నిర్మాణ శైలి చూసి అబ్బురపడ్డారు. కాకతీయ చరిత్ర, విశిష్టతను కోట గైడ్ రవియాదవ్ విదేశీయులకు వివరించారు.

సభకు లక్షలాదిగా తరలిరావాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


కాజీపేట అర్బన్ : వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

కాజీపేట అర్బన్ : బీఆర్ఎస్ 25 ఏళ్ల పండుగకు బీఆర్ఎస్ కార్యకర్తలు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేసుకుందామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. గ్రేటర్ వరంగల్ 46, 64 డివిజన్ల ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని శనివారం మడికొండలోని ధర్మసాగర్‌రోడ్డులో కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దయాకర్‌రావు హాజరై మాట్లాడారు. ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలని, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



హన్మకొండ : మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

పండుగలా రజతోత్సవ సభ

హన్మకొండ : బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను పండుగలా నిర్వహించుకుందామని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారన్నారు. 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని విమర్శించారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు.సమావేశంలో తెలంగాణ గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, నాయకులు కమరున్నీసా బేగం, నార్లగిరి రమేష్, ఇమ్మడి లోహిత, ఉడుతల సారంగపాణి, బొంగు అశోక్, చెన్నం మధు పాల్గొన్నారు.

మడికొండలో జై బాపు.. జై భీమ్ కార్యక్రమం


డప్పు వాయిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

కాజీపేట అర్బన్ : రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు గడుస్తున్న తరుణంలో రాజ్యాంగం విలువలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. కాజీపేట మండలం మడికొండలో శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యకమ్రానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. భారీగా ఏర్పాటు చేసిన ర్యాలీలో డప్పు వాయించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి

- నిట్ ప్రొఫెసర్ ఆనంద్‌కిషోర్


మాట్లాడుతున్న నిట్ ప్రొఫెసర్ ఆనంద్‌కిషోర్

కేయూ క్యాంపస్: భారత రాజ్యాంగం ఎంతో గొప్పదనిహక్కులు కల్పించిందని అందువలన రా జ్యాంగంలోని అంశాలపై అవగాహన కలిగి ఉండాలని వరంగల్ నిట్ ప్రొఫెసర్ ఆనంద్‌కిషోర్ అన్నారు. శనివారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం సామాజిక న్యాయం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రజలకు రక్షణ కవచంగా ఉపయోగపడుతుందన్నారు. రాజ్యాంగం ద్వారానే ప్రజలకు అనేక రకాల హక్కులు కల్పించబడ్డాయని, సామాజిక న్యాయం కూడా అందేలా కూడా అనేక అంశాలు రాజ్యాంగంలో పొందుపరిచి ఉన్నాయన్నారు. సమావేశంలో అధ్యాపకులు వాసిరెడ్డి కృష్ణారావు, శ్రీనివాస్‌రావు, సదాశివ్,గిరిప్రసాద్ ,వెంకటేశ్వర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి

కాజీపేట : కొంతకాలంగా ప్రజల ప్రాణాలను హరించేలా ప్రాణాంతకంగా తయారైన మడికొడ డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టాలని ప్రొఫెసర్ ఎం.ఎర్రగట్టు స్వామి డిమాండ్ చేశారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో శనివారం అడహక్ కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు డంపింగ్ యార్డ్‌తో ఇన్ని ఇబ్బందులు లేవన్నారు. వరంగల్ నగరంలోని చెత్తను అంతా తెచ్చి కాల్చివేస్తుండటంతో భూగర్భ జలాలు కలుషితం కావడం, దాదాపు పది గ్రామాల ప్రజలు పొగ కారణంగా శ్వాసకోశ వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నన్నా పాలకులకు పట్టడంలేదని విమర్శించారు. అధికారులు న్యాయం చేయని పక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో బొల్లికొండ రాజు, దువ్వ నవీన్, టి.కరుణాకర్ రెడ్డి, వినోద్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు ఆటో కార్మికుల విరాళం




హన్మకొండ: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు హనుమకొండలోని త్రిచక్ర పాదుపు, పరపతి పరస్పర సహకార సంఘం (ఆటో కార్మికుల సంఘం) రూ.1,00,116 విరాళాన్ని అందించింది. ఈ మేరకు సహకార సంఘం అధ్యక్షుడు ఇసంపల్లి సంజీవ, ప్రతినిధులు శనివారం పార్టీ కార్యాలయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ బాస్కర్‌కు విరాళం మొత్తాన్ని అప్పగించారు.

ఏఐతో విద్యాబోధన

విద్యారణ్యపురి : హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఉన్నత పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) తరగతులను శనివారం హైస్కూల్ హెడ్మాస్టర్ జి.వి రామారావు ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ ఎం.శ్రీనివాస్, ఏఐ ఇన్‌చార్జ్ ఆర్.మహేందర్, పాల్గొన్నారు. అలాగే జులైవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏఐతో కంప్యూటర్ ద్వారా విద్యాబోధన శనివారం హైస్కూల్ హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



హన్మకొండ : హనుమకొండ ప ద్మాక్షి రోడ్డులోని హనుమత్ గిరి శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శనివారం చిన్న హనుమా న్ జయంతి ఉత్సవాన్ని భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరుపుకున్నారు. అర్చకుడు ఆరుట్ల రామాచార్యులు ఉదయం 5 గంటలకు పంచామృత అభిషేకము, చందన సేవ, 100 కిలోల బంతిపూలతో అలంకరణ, అర్చన, హనుమాన్ మండల మాల ధారణ కా ర్యక్రమం నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో అంజన్న


కాజీపేట: 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్‌లో కొలువుదీరిన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో దక్షిణముఖంగా కొలువై ఉన్న అభయాంజనేయస్వామికి సింధూరవిలేపనం, తమలపాకుల సేవ, వడమాలలతో అర్చనలు నిర్వహించారు.

రోడ్డుపై గుంతలు పూడ్చాలి



రామన్నపేట : వరంగల్ పోతననగర్ రోడ్డులో రెండేళ్లుగా ఏర్పడిన గుంతలను పూడ్చకుండా ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం గుంతలను పూడ్చాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు.

గుండెపోటుతో ఎంపీడీఓ మృతి


మహబూబ్ హుస్సేన్(ఫైల్)

మొగుళ్లపల్లి: స్థానికంగా ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ మహబూబ్ హుస్సేన్(61) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వస్థలం హనుమకొండ జిల్లా పరకాల అయినప్పటికీ కుటుంబ అవసరాల రీత్యా హనుమకొండ పట్టణంలో నివాసముంటూ విధులకు హాజరయ్యేవారు. విధి నిర్వహణలో బాధ్యతయుతంగా ఉంటూ.. ప్రజలందరికీ అందుబాటులో ఉండేవారని పేరుంది. వచ్చే నెలలో పదవి విరమణ చేయనుండగా.. ఇంతలోనే గుండెపోటుతో మృతి చెందడం అందరినీ కలిచివేసింది. ఆయన మృతిపై కార్యాలయ సిబ్బంది, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు.

క్లుప్తంగా

'మెపా' జిల్లా కార్యాలయం ప్రారంభం



హన్మకొండ : హనుమకొండ జవహర్‌నగర్‌లో ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా నూతన కార్యాలయాన్ని ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో కమిటీలు వేయడంతో పాటు కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెపా ప్రతినిధులు పులి ప్రభాకర్, పొన్నం రాజు, రాజేష్, ప్రభాకర్, చిరంజీవి, నీరటి రాజు, సింగారపు రామకృష్ణ, చంద్రశేఖర్, సదానందం, రవీందర్, కృష్ణ,శ్యాంసుందర్ పాల్గొన్నారు.

బీరువా బహూకరణ

రామన్నపేట : వరంగల్ ఆటోనగర్‌లోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలకు శనివారం ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ బీరువాను బహూకరించారు. యోగసాధకులైన శివాని పుట్టిన రోజును పురస్కరించుకుని చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు వారి అవసరాల కోసం బీరువాను అందజేశారు.పాఠశాల నిర్వహకులు మణిశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ వాహనాలకు నో ఎంట్రీ



కాజీపేట అర్బన్ : భారీ వాహనాలకు ఇక నో ఎంట్రీ అంటూ మడికొండ పోలీసులు శనివారం బారీ కేడ్లను ఏర్పాటు చేశారు. కాజీపేట మండలం మడికొండలో జనావాసాల మధ్య నిత్యం భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్న తరుణంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి సమస్యను గ్రామస్తులు తీసుకెళ్లారు. దీంతో మడికొండ సీఐ కిషన్ ఆధ్వర్యంలో గ్రామంలోకి భారీ వాహనాలు రాకపోకలను కొనసాగించకుండా బారీకేడ్లను ఏర్పాటు చేశారు. గ్రామస్తులు పోలీసుల తీరుపై హర్షం వ్యక్తం చేశారు.

గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులకు ప్రోత్సాహం



హన్మకొండ : విద్యార్థులను ప్రోత్సహించేందుకు గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించినట్లు హనుమకొండ భవాని నగర్‌లోని సన్‌షైన్ ప్లే స్కూల్ డైరెక్టర్ పి.నరేష్‌గుప్త అన్నారు. శనివారం స్కూల్‌లో యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీ స్కూల్‌లో నిర్వహించిన ఇలాంటి కార్యక్రమాలు వారు పెద్దయ్యాక తీపి గుర్తులుగా ఉండిపోతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు జ్ఞాన యాత్ర

నయీంనగర్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆధ్వర్యంలో ఎంజీఎం జంక్షన్ నుంచి హనుమకొండ అంబేడ్కర్ సర్కిల్ వరకు జ్ఞానయాత్ర నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు తెలిపారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ యాత్రలో నగర ప్రజలు, మేథావులు, దళిత సంఘాల సభ్యులు. భిన్న వర్గాల ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ సంఘాల నాయకులు ఎం.ఎల్లయ్య, నరసింహారావు, మన్నె బాబురావు, చుంచు రాజేందర్, రాంచందర్, కదారి కుమార్ పాల్గొన్నారు.

హరితకు కూచిపూడిలో గిన్నిస్ రికార్డ్



హనుమకొండ కల్చరల్: కూచిపూడి నృత్య ప్రదర్శనలో హనుమకొండ గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన డాక్టర్ గుంటోజు హరిత గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సాధించారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ప్రపంచ కూచిపూడి నత్య ప్రదర్శనలో ఆమె ప్రతిభ కనబర్చారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 4,218 మంది నృత్య కళాకారులు పాల్గొనగా.. హరిత ప్రదర్శించిన నృత్యానికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ దక్కింది. హనుమకొండలో హరితా కృష్ణ కూచిపూడి నృత్య కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేసి ఆమె ఎందరో కళాకారులను తీర్చిదిద్దారు. శనివారం సాయంత్రం నృత్య శిక్షణ కళాశాలలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిన డాక్టర్ హరితకు శిక్షణ పొందిన విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు.